## అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**కలెక్టర్ నారాయణరెడ్డి**



వికారాబాద్, డిసెంబర్ 13 : జిల్లా అధికారులందరూ వారానికి నాలుగు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి పర్యటనలు, అటెండెన్స్ యాప్ హాజరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ ప్రతి వారం నాలుగు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులపై ఆరా తీయాలని సూచించారు. కింది స్థాయి అధికారులు పనిచేసే విధంగా చర్యలు చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శాఖలో సమయపాలన పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించే విధంగా అటెండెన్స్ యాప్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు చేపట్టాలని, ఇక నుంచి అటెండెన్స్ యాప్‌ను సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి**



విద్యార్థి ప్రగతిని పరిశీలిస్తున్న డీఈవో రేణుకాదేవి

ధారూరు, డిసెంబర్ 13 : పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అందరిని ఉత్తీర్ణులు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. బుధవారం ధారూరు మండల పరిధిలోని తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ప్రగతిని పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులపై శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆమె వెంట ధారూరు మండల విద్యాధికారి బాబుసింగ్, నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, ఎంఆర్‌పీలు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

# 100 ఎకరాల్లో అర్బన్ పార్కులు

- జిల్లాలోని తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లో అర్బన్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయం
- అంతారం, అప్పాయిపల్లి, జాఫర్‌పల్లి, అనంతగిరి, బొంరాసుపేటలో కూడా నిర్మాణానికి ప్రతిపాదనలు
- ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు
- ఇప్పటికే గొట్లపల్లి అంతారం ఫారెస్ట్‌లో అర్బన్‌పార్కు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్




వికారాబాద్, డిసెంబర్ 13, (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఐదు అర్బన్ పార్కులను ఏర్పాటు కానున్నాయి. జిల్లాలోని కొడంగల్, తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లో అర్బన్ పార్కులను ఏర్పాటు చేసేందుకుగాను ప్రతిపాదించారు. తాండూరు నియోజకవర్గంలో తాండూరు మండలం గొట్లపల్లి-అంతారం రిజర్వ్ ఫారెస్ట్‌లో అర్బన్ పార్కు ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలకు అనుమతులు మంజూరుకాగా, పనులు జరుగుతున్నాయి. మిగతా కొడంగల్ నియోజకవర్గంలోని అప్పాయిపల్లి అటవీ ప్రాంతం, బొంరాసుపేట్, పరిగి నియోజకవర్గంలోని జాఫర్‌పల్లి ఫారెస్ట్, వికారాబాద్‌లోని అనంతగిరి అటవీ ప్రాంతంలో అర్బన్ పార్కుల ఏర్పాటుకుగాను ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. సంబంధిత నాలుగు అర్బన్ పార్కుల ఏర్పాటుకుగాను ఇప్పటికే జిల్లా అటవీ శాఖ అధికారులు ప్రతిపాదనలను అటవీ శాఖ ఉన్నతాధికారులకు అందజేశారు. అర్బన్ పార్కుల ప్రతిపాదనలకు అనుమతులు జారీ అయిన వెంటనే పనులు ప్రారంభించేందుకు జిల్లా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు ప్రతి అర్బన్ పార్కును 100-120 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ప్రతి అర్బన్ పార్కు ఏర్పాటుకుగాను కోట్లాది నిధులను ఖర్చు చేయనున్నారు. అర్బన్ పార్కుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు వాకింగ్ ట్రాక్, వాచ్ టవర్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా అర్బన్ పార్కులను ఏర్పాటు చేయనున్న ఆయా అటవీ ప్రాంతాల్లో ఔషధ మొక్కలు, మూలిక మొక్కలు, అలంకార మొక్కలతోపాటు తదితర మొక్కలను నాటనున్నారు.

**గొట్లపల్లి-అంతారం అర్బన్‌పార్కు పనులు ప్రారంభం..**

తాండూరు పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. తాండూరు పట్టణానికి చుట్టు పక్కల వందల సంఖ్యల్లో ఉన్న నాపరాతి, సిమెంట్ పరిశ్రమలతో వెలువడే అధిక కాలుష్యానికి కళ్లెం వేసేందుకు అర్బన్ పార్కును ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే అనుమతులు జారీకాగా, పనులు జరుగుతున్నాయి. తాండూరు పట్టణానికి 4 కిలోమీటర్ల సమీపంలోని గొట్లపల్లి అంతారం అటవీ ప్రాంతంలో పట్టణ ఉద్యానవనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తాండూరు నుంచి జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట వెళ్లే దారిలోని గొట్లపల్లి అంతారం రిజర్వ్ ఫారెస్ట్‌లోని 120 ఎకరాల్లో అర్బన్ పార్కు ఏర్పాటుకు నిర్ణయించారు. సంబంధిత ఉద్యానవనంలో కాలుష్యాన్ని నియంత్రించే ఔషధ మొక్కలతోపాటు మూలిక మొక్కలు, అలంకార మొక్కలతోపాటు తదితర మొక్కలతో కూడిన ఉద్యానవనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునే పరికరాలు, అడ్వెంచరల్ ఆటలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. రాశివనం, నక్షత్ర వనాలను కూడా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. మొత్తం రూ.కోట్లన్నర నిధులతో అర్బన్‌పార్కు పనులకు సంబంధించి జోరుగా సాగుతున్నాయి. 45 హెక్టార్లలో ఏర్పాటు చేయనున్న అర్బన్‌పార్కు చుట్టూ ఇనుప కంచెను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తాండూరు మండలంలోని గొట్లపల్లి-అంతారం అర్బన్‌పార్కు పనులు ఇప్పటివరకు 50 శాతం మేర పనులు పూర్తయ్యాయి.

**తాండూరులో కొనసాగుతున్న అర్బన్‌పార్కు పనులు..**



జిల్లాలో ఐదు అర్బన్ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను అందజేశామని, ఇప్పటికే తాండూరు మండలం గొట్లపల్లి-అంతారం ఫారెస్ట్‌లో అర్బన్ పార్కు ఏర్పాటుకు అనుమతులు మంజూరుకాగా ఇప్పటివరకు 50 శాతంమేర పనులు పూర్తయ్యాయి. అనంతగిరి, జాఫర్‌పల్లి, అప్పాయిపల్లి, బొంరాసుపేట అటవీ ప్రాంతాల్లో అర్బన్ పార్కుల ఏర్పాటుకుగాను అనుమతులు వచ్చిన పనులు ప్రారంభిస్తాం.

-జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి

# ఆశాజనకంగా వేరుశనగ సాగు



- మంచి ఆదాయం ఉందంటున్న అన్నదాతలు
- జిల్లాలో 13444 ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు
- పంటలకు అడవి పందుల బెడద

బొంరాస్‌పేట, డిసెంబర్ 13 : వికారాబాద్ జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో సాగు చేస్తున్న వేరుశనగ పంట సాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది ఆశించిన మేరకు వర్షాలు కురవడంతో బోర్లలో భూగర్భ జలాలు కొంతవరకు పెరిగాయి. ఏటా వ్యవసాయ బోర్ల కింద యాసంగిలో వేరుశనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. రైతులు ఈ పంట దిగుబడిపై ఆశలు కూడా ఎక్కువగా పెట్టుకుంటారు. కొడంగల్ నియోజకవర్గంలో బొంరాస్‌పేట మండలంలోనే వేరుశనగను ఎక్కువగా సాగు చేస్తారు. తుంపర సేద్యం పరికరాలకు గతంలో ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని వ్యవసాయ బోర్ల కింద ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగను సాగు చేస్తూ వస్తున్నారు. వీటికి తోడు వ్యవసాయానికి ప్రభుత్వం 24 గంటలు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయడంతో సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. వికారాబాద్ జిల్లాలో యాసంగిలో ఈ ఏడాది 13444 ఎకరాలలో వేరుశనగ పంటను సాగు చేశారు. ఈ ఏడాది బోర్లలో నీటిమట్టం పుష్కలంగా ఉండడంతో రైతులు మంచి దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలో పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. దిగుబడులు ఆశాజనకంగా వచ్చి గిట్టుబాటు ధరలు వస్తే వేరుశనగ సాగు లాభాలనిస్తుందని రైతులు ఆశతో ఉన్నారు.

**అడవి పందుల బెడద**

పంటచేతికొచ్చే దశలో అడవి పందుల బెడద నుంచి పంటను కాపాడుకోవడం రైతులకు ఓ సవాలుగా మారింది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో అడవి పందుల బెడద తీవ్రంగా ఉంది. రాత్రి, పగలు సమయాల్లో వేరుశనగ పంటలపై పందులు గుంపులు గుంపులుగా దాడిచేసి పంటనంతా దున్ని నాశనం చేస్తుంటాయి. పందుల బారినుంచి పంటలను కాపాడుకోవడం కోసం రైతులు వాటి చుట్టూ పాత చీరలను రక్షణగా కడుతున్నారు. కొందరు రైతులు రాత్రిపూట పొలాలకు వెళ్లి పందులు రాకుండా బాణాసంచా కాల్చడం, మంటలు పెట్టడం, పొలాల చుట్టూ లైట్లు వేసి కాపాడుకుంటున్నారు.

**వేరుశనగకు తెగుళ్ల నివారణ చర్యలు**

వేరుశనగ పంటకు ఆకుముడుత, ఆకుమచ్చ తెగులు, పోగాకు లద్దె పురుగు ఆశిస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు. అక్కడక్కడా పంటకు ఆకుముడుత పురుగు ఉందని, విత్తిన 15 రోజుల నుంచి 45 రోజుల వ్యవధిలో ఉన్న పంటపై ఈ పురుగు ఆశిస్తుందని, దీనిని నివారించడానికి క్లోరోపైరిపాస్ 500 మిల్లీ లీటర్ల మందును లేదా ఎసిఫేట్ 300 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని అధికారులు సూచించారు. పలు చోట్ల తిక్కా ఆకుమచ్చ తెగులు గుర్తించామని ఈ తెగులు ఎక్కువగా విత్తనశుద్ధి చేయకపోవడం వల్ల ఆకులపై నల్ల మచ్చలు ఏర్పడుతుందని, ఇది విత్తిన 30 రోజుల వ్యవధిలో ఆశిస్తుంది. దీని నివారణకు క్లోరంత్రోనిల్‌ప్రోల్ 400 గ్రాముల మందును లేదా టెబ్యుకొనాజోల్ 200 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలానికి పిచికారీ చేసుకోవాలి. పోగాకు లద్దె పురుగు నివారణకు నొవాల్యురాన్ 200 ఎంఎల్ లేదా ఫ్లూబెండియామైడ్ 40 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. రసం పీల్చే పురుగులు అయినటువంటి తామర పురుగులు, దీపపు పురుగుల నివారణకు 100 గ్రాముల థమోమిథాక్సామ్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

## 16న జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 13 : రంగారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 16న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో దిలీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ఉదయం 11గంటలకు మహిళా సంక్షేమ సంఘం-5, ఉదయం 11గంటలకు గ్రామీణాభివృద్ధి స్థాయి సంఘం 2, మధ్యాహ్నం 12గంటలకు సాంఘిక సంక్షేమ స్థాయి సంఘం, మధ్యాహ్నం 12:30గంటలకు పనులు స్థాయి సంఘం 7, మధ్యాహ్నం 12:30గంటలకు ప్రణాళిక, పనులు, మరియు ఆర్థికస్థాయి సంఘం-1, మధ్యాహ్నం 2గంటలకు వ్యవసాయం, పై సమావేశాలకు సంబంధిత జిల్లా అధికారులు సకాలంలో పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

## బుచ్చిగూడలో అటవీ జంతువుల సంచారం

షాద్‌నగర్‌రూరల్, డిసెంబర్ 13 : ఫరూఖ్‌నగర్ మండలంలోని బుచ్చిగూడ గ్రామంలో మంగళవారం రాత్రి పశువులపై అటవీ జంతువులు దాడి చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన మహేందర్ తన వ్యవసాయ క్షేత్రంలోని దూడలపై అటవీ జంతువులు దాడి చేసి చంపినట్లు తెలిపారు. కొన్ని రోజులుగా నియోజకవర్గంలో మూగజీవాలపై అటవీ జంతువులు దాడిచేస్తూ పశువులను చంపుతుండటంతో రైతులు తీవ్ర భయందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వాటినుంచి పశువులు, తమను కాపాడాలని కోరుతున్నారు. క్రూరమృగం ఏంటనేది తెలియాల్సి ఉందని రైతులు పేర్కొంటున్నారు.